సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రయోజనకర సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

కేబుల్ తీగలతో ఇక్కట్లు



ప్రమాదకరంగా వేలాడుతున్న కేబుల్ తీగలు

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ ఈబీ కాలనీ శ్మశాన వాటిక వద్ద కేబుల్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ స్తంభాలకు కట్టిన కేబుల్ వైర్లు దిగువకు వేలాడుతున్నాయి. ఇక్కడ ఉన్న నివాసాలకు, కార్యాలయాలు, శ్మశాన వాటికకు వెళ్లే వారికి తగులుతున్నాయని వాపోతున్నారు. ఈ తీగలను గమనించకుండా వేగంగా వెళ్తే ఉరిలా బిగుసుకునే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం వీటిని పర్యవేక్షించే వారు కరువవుతుండడంతో నిత్యం ప్రజల ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డెక్కిన మురుగు



ధరణి అపార్ట్‌మెంట్ సమీపంలో రోడ్డుపైకి వస్తున్న మురుగు నీరు

గోపాలపట్నం: కాలువల్లో పూడికలు సకాలంలో తీయక పోవడంతో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. జీవీఎంసీ 91వ వార్డు ధరణి అపార్ట్‌మెంట్ సమీపంలో ఎగువ నుంచి వచ్చే మురుగు నీరు బీఆర్‌టీఎస్ అప్రోచ్ వద్ద డ్రైన్‌లోకి వెళ్లే దారి లేక రోడ్డు పైనుంచి ప్రవహిస్తోంది. ఈ పరిస్థితి చాలా రోజులుగా ఉన్నా అధికారులు నివారణ చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మురుగు నీరు రోడ్డుపైకి కాకుండా తగిన విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వేంకటాద్రిపై ప్రత్యేక పూజలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: చాతుర్మాస దీక్షలో భాగంగా స్థానిక వేంకటాద్రిపై బుధవారం ప్రత్యేక పజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో సుందర కాండ హవనం చేశారు. అనంతరం శ్రీనివాస నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ప్రమాదమని తెలిసీ..



ఐవోసీ మార్గంలో విద్యుత్ వైర్ల దిగువన పార్క్ చేసిన ఆయిల్ ట్యాంకర్



బ్లాక్ ఆయిల్ ప్లాంట్‌కు వెళ్లే మార్గంలో విద్యుత్ వైర్ల దిగువ పార్క్ చేసిన ఆయిల్ లారీ

- విద్యుత్ వైర్ల కింద ఆయిల్ ట్యాంకర్ల పార్కింగ్
- నిప్పురవ్వలు ట్యాంకర్‌పై పడితే పెనుప్రమాదం
- స్థానికుల్లో ఆందోళన

మల్కాపురం: ప్రమాదకర ప్రదేశాలలో ఆయిల్ లారీలను పార్క్ చేస్తున్నారు. ప్రమాదమని తెలిసినా లారీ డ్రైవర్లు లెక్కచేయకపోవడంతో పరిసర ప్రాంతాల వారు ఆందోళన చెందుతున్నారు. ఏదైనా పెనుప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు?

మల్కాపురం సమీపాన ఐవోసీ టెర్మినల్ ప్లాంట్‌కు వెళ్లే మార్గంలో ఐవోసీ, బ్లాక్ ఆయిల్ ప్లాంట్‌లు ఉన్నాయి. ఆయా టెర్మినల్ ప్లాంట్‌లకు నిత్యం వందల సంఖ్యలో ఆయిల్ లారీలు వస్తుంటాయి. వీటిలో ఆయిల్ లోడ్ అయిన కొన్ని లారీలు తమ గమ్యస్థానాలకు వెళ్లేముందు కొంతమంది డ్రైవర్లు ఐవోసీ మార్గంలో చింతామణి దుర్గాగణపతి ఆలయం ముందు, బ్లాక్ ఆయిల్ ప్లాంట్‌కు వెళ్లే మార్గంలో నిర్లక్ష్యంగా పార్క్ చేస్తున్నారు. అయితే పార్క్ చేస్తున్న ప్రాంతంలో లారీల ఎగువ భాగంలో విద్యుత్ హెచ్‌టీ, ఎల్‌టీ వైర్లు ఉన్నాయి. బాగా గాలి వీస్తే విద్యుత్ వైర్ల రాపిడికి నిప్పురవ్వలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. లేదా వైర్లపై ఏదైనా పక్షులు షాక్‌కు గురైనా నిప్పురవ్వలు రావొచ్చు. ఆ నిప్పు రవ్వలు ఆయిల్ లారీపై పడితే పెద్ద ఎత్తున మంటలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. ఇక్కడ గల చింతామణి దుర్గాగణపతి ఆలయానికి నిత్యం వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. మందిరానికి ఎదురుగా, విద్యుత్ వైర్ల దిగువన ఆయిల్ లారీలను పార్క్ చేయడం చూసి వారు కలవరపడుతున్నారు.

డ్రైవర్లు స్పందించి, ఆయిల్ ట్యాంకర్లను విద్యుత్ వైర్ల దిగువన కాకుండా, విశాలమైన ప్రదేశాలలో పార్క్ చేయాలని పలువురు కోరుతున్నారు.

వైద్యకళాశాలల ప్రైవేటీకరణ దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ 59వ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ

మల్కాపురం: ప్రభుత్వం ఆధ్వర్యంలో నడవాల్సిన మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టాలని కూటమి సర్కారు ఆలోచన చేయడం దారుణమని 59వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ అన్నారు. పేద వైద్య విద్యార్థులకు అండగా, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న పోరాటానికి అందరం సంఘీభావం తెలియజేద్దామని పిలుపునిచ్చారు. ఈ నెల 9వ తేదీన జగన్ మోహన్‌రెడ్డి నర్సీపట్నం రానున్న సందర్భంగా ఆయనకు మద్దతుగా పోరాటంలో నిలిచేందుకు 59వ వార్డుకు చెందిన పార్టీ కార్యకర్తలు, అభిమానులు సిద్ధమయ్యారు. దీనిలో భాగంగా రేవళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో వార్డు పరిధి నెహ్రూనగర్ వద్ద బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రేవళ్ల మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, ఆర్టీసీ వంటివి ప్రభుత్వ ఆధీనంలోనే నడవాలని, దీనివల్ల పేదలకు న్యాయం జరుగుతుందనే ఆలోచనతో నాటి పెద్దలు నిర్ణయం తీసుకున్నారన్నారు. పెద్దల ఆలోచనలను పట్టించుకోకుండా.. పేదల నోట్లో మట్టి కొట్టే ధోరణిలో ప్రస్తుత కూటమి సర్కార్ ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై వైఎస్ జగన్ పోరాటానికి తామంతా సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. పోలీసులు, కూటమి నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి చేసే పోరాటాన్ని ఆపలేరన్నారు. జనం జగన్ వెంట ఉన్నారని, కూటమి సర్కార్‌కు ఇక చుక్కలే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో భూపతి నాయుడు, అర్జున్, అప్పలరాజు, మడక అప్పారావు, ఎడ్ల సత్యనారాయణ, వెంకినాయుడు, ఖాన్, సరోజ, లక్ష్మి, చంటి తదితరులు పాల్గొన్నారు.

జూలో ముగిసిన వన్యప్రాణి వారోత్సవాలు



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న సీఎఫ్ మహ్మద్ దివాన్ మైదీన్

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో వన్యప్రాణి వారోత్సవాలు బుధవారం ముగిశాయి. పిల్లలు పలు రకాల పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. జూలో వారోత్సవాలు ఈ నెల 2న ప్రారంభమైన విషయం తెలిసిందే. ప్రారంభం నుంచి పాఠశాల, కళాశాలలతోపాటు వివిధ వయసుల వారికి జూ అధికారులు పోటీలు నిర్వహించారు. వన్యప్రాణులు, పర్యావరణం, తదితర అంశాలపై వక్తృత్వం, చిత్రలేఖనం, ఫొటోగ్రఫీ తదితర పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన వారికి అధికారులు బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. సీఎఫ్ మహ్మద్ దివాన్ మైదీన్, సహాయ అటవీ జనరల్ ఇన్‌స్పెక్టర్ కె.బాలాజీ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వన్యప్రాణులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వాటిని సంరక్షించి మానవులు, ప్రకృతి మధ్య సామరస్యాన్ని పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో జూ క్యూరేటర్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు, సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నవంబర్ 5న రాధాకృష్ణ మహోత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యాదవ సంఘ నాయకులు

బీచ్‌రోడ్డు : ప్రతీ సంవత్సరం అత్యంత వైభవంగా జరుపుకునే రాధాకృష్ణ మహోత్సవాలు ఈ ఏడాది నవంబర్ 5న నిర్వహించనున్నామని యాదవ సంఘ గౌరవ అధ్యక్షుడు అక్కరమాని వెంకటరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం సంపత్ వినాయక దేవాలయం వద్ద విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి రాధాకృష్ణ మహోత్సవాల (పాలు పెరుగు యదుమేళా) పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీచ్ రోడ్డు గోకుల్ పార్కు వద్ద నిర్వహించే మహోత్సవాలు యాదవ సమాజంలో ఐక్యత, సాంస్కృతిక సంప్రదాయాల పరిరక్షణ, భక్తి భావాన్ని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘ గౌరవ అధ్యక్షుడు బరినకాన రామారావు, విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్ నూతన ఏడీఆర్‌ఎంగా రామారావు



తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ నూతన అడిషనల్ డివిజినల్ రైల్వే మేనేజర్‌గా కుండు రామారావు నియమితులయ్యారు. శ్రీకాకుళం జిల్లా, పలాసకు చెందిన ఆయన 2002లో ఆంధ్రా యూనివర్సిటీలో బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసారు. ప్రజాసేవపై గల ఆసక్తితో 2006లో ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసెస్ పరీక్ష రాసి, ఆలిండియా 44వ ర్యాంకు సాధించి రైల్వేలో చేరారు. పలు జోన్లలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్‌గా, సీనియర్ అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్‌గా, సీనియర్ డివిజినల్ ఇంజినీర్‌గా, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్‌గా పని చేశారు. జపాన్‌లో నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో కూడా ఈయన పాల్గొన్నారు. తన సేవలకు గాను ప్రతిష్టాత్మక జనరల్ మేనేజర్ అవార్డును 2010లో పొందుకున్నారు.

అయ్యప్ప మండల దీక్షలు ప్రారంభం

పెందుర్తి: సుజాతనగర్‌లోని పూర్ణ పుష్కళ సమేత శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, గురుస్వామి డాక్టర్ వాకా చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా అయ్యప్పకు విశేష అభిషేకాలు జరిపారు. అనంతరం మండల దీక్షాపరులకు అయ్యప్ప మాలధారణ చేయించారు. స్వామికి విశేష పూజలు జరిపి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

అధినేతను ఘనంగా స్వాగతిద్దాం

- మాజీ సీఎం జగన్‌కు ఆత్మీయ ఆహ్వానం పలికేందుకు నాయకుల సన్నాహాలు
- ఎన్‌ఏడీ నుంచి వెంకటాపురం జంక్షన్ వరకు అభిమానుల స్వాగత తోరణం



సమావేశంలో వైఎస్ జగన్ పర్యటన వివరాలు తెలియజేస్తున్న చుక్క ప్రసాద్ రెడ్డి



91వ వార్డులో స్వాగత సన్నాహాలపై చర్చిస్తున్న వార్డ్ ఇన్‌చార్జి ఆళ్ల పైడిరాజు, చుక్క పైడిరాజురెడ్డి

గోపాలపట్నం: అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో మెడికల్ కాలేజీ పర్యటనకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వస్తున్న నేపథ్యంలో ఘన స్వాగతం పలికేందుకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్నాహాలు చేస్తున్నారు. విమానాశ్రయం జాతీయ రహదారి మీదుగా బుచ్చిరాజుపాలెం, బాజీ జంక్షన్, గోపాలపట్నం, ఎయిర్‌పోర్టు జంక్షన్ నుంచి దారి పొడవునా పార్టీ జెండాలు, కండువాలతో ఆయనకు స్వాగతం పలకనున్నారు. పారిశ్రామిక ప్రాంతాల నుంచి వచ్చేవారు ఎయిర్‌పోర్టు జంక్షన్ నుంచి కాకానినగర్ జంక్షన్ వరకు ఉంటారని, ఎన్‌ఏడీ జంక్షన్ నుంచి వెంకటాపురం జంక్షన్ వరకు 56 నుంచి 92వరకు గల ప్రజలు ఉంటారని పార్టీ నాయకులు తెలిపారు. ఈ మేరకు వార్డుల వారీగా కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. అభిమాన నాయకునికి స్వాగతం పలికేందుకు అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు. 90వ వార్డు అధ్యక్షుడు చుక్క ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో బుచ్చిరాజుపాలెంలో ఆయన ఇంటి వద్ద ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. 91వ వార్డు ఇన్‌చార్జి ఆళ్ల పైడిరాజు ఆధ్వర్యంలో అనుబంధ సంఘాల నాయకులు చుక్క పైడిరాజురెడ్డి తదితరులతో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు.

మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నడపాలి

- మాజీ డిప్యూటీ మేయర్ శ్రీధర్

వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడపాలని మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 52వ వార్డు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో వైద్య కళాశాలలు నడిస్తే పేద విద్యార్థులకు మేలు జరుగుతుందని తెలిపారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో నడిస్తే వైద్యవిద్యను కొనుక్కునే పరిస్థితి నెలకొంటుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదలకు మంచి జరగాలనే సంకల్పంతో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి, భారీగా డబ్బులు దండుకునే పనిలో పడిందన్నారు. ఆ ప్రయత్నాన్ని అడ్డుకోవాలని, పేదలకు ఉన్నత చదువులు అందేవరకు జగనన్నకు మద్దతుగా నిలుద్దామన్నారు. మాకవరపాలెంలో మెడికల్ కళాశాల పర్యటనకు వస్తున్న జగనన్నకు భారీగా స్వాగతం పలుకుదామని పిలుపునిచ్చారు.

సెయింట్ జోసెఫ్‌లో రచయిత్రుల జాతీయ సదస్సు



జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు



అతిథులు, అధ్యాపకులతో విద్యార్థినులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో భాషా విభాగాల ఆధ్వర్యంలో 'స్వాతంత్ర్యానంతర తెలుగు-హిందీ సాహిత్యంలో రచయిత్రుల సాహిత్య కృషి' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ అధ్యక్షతన బుధవారం జరిగింది. గాంధీ సెంటర్ అధ్యక్షులు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రచయిత్రుల కృషి అభినందనీయమన్నారు. గౌరవ అతిథులుగా హాజరైన ఏపీడబ్ల్యూజే అధ్యక్షుడు డాక్టర్ ఎస్. కృష్ణబాబు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డి.వి. సూర్యారావు రచయిత్రుల సాహితీ కృషి గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా రైటర్స్-జర్నలిస్ట్స్ అసోసియేషన్ సౌజన్యంతో జరగనున్న రెండు రోజుల సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సదస్సు కన్వీనర్, కళాశాల కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.కె. జయలక్ష్మి రచించిన కథల సంపుటిని, సెమినార్ గ్రంథాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ద్వితీయ భాషా విభాగాధ్యక్షులు డాక్టర్ జె.నిర్మల, డాక్టర్ ఎస్.దీప్తి, డాక్టర్ కోటేశ్వరరావు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలతోనే ఉన్నత స్థానం



ధ్రువపత్రాలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ కేవీ రమణ

మురళీనగర్ : పాలిటెక్నిక్ కెమికల్ డిప్లమా విద్యార్థులు సబ్జెక్టులో పట్టు సాధించడంతోపాటు జీవన నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారానే ఉన్నత స్థానానికి చేరుకోగలరని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ తెలిపారు. గైస్ కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉన్నత ఫౌండేషన్ నిర్వహించిన నైపుణ్య శిక్షణ ముగింపు సందర్భంగా బుధవారం ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సమాచార నైపుణ్యాలు, ఆంగ్ల భాషలో మాట్లాడడం, జీవన నైపుణ్యాలను పెంచుకోవడం వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. స్వీయ నిర్వహణ, బృంద సభ్యులతో సమన్వయం చేసుకుని పని చేయడం ద్వారా ఉద్యోగాల్లో రాణించగలరని చెప్పారు. అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించారు. పెట్రో కెమికల్స్ హెడ్ సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, సీనియర్ లెక్చరర్లు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ స్టడీ ఆన్ సోషల్ ఇంక్లూషన్ (సీఎస్ఎస్ఐ) ఆధ్వర్యంలో 2026 ఫిబ్రవరి 3, 4న నిర్వహించనున్న రెండు రోజుల జాతీయ సదస్సు పోస్టర్‌ను వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ బుధవారం ఆవిష్కరించారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఆచార్యులు, పరిశోధకులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థల నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురావడానికి, వివిధ అంశాలపై వారి ఆలోచనలు పంచుకోవడానికి ఈ సెమినార్ దోహదపడుతుందని వీసీ అన్నారు. అనంతరం 'పబ్లిక్ పాలసీ అండ్ సోషల్ ఇంక్లూసివ్‌నెస్ - యాన్ ఇండియన్ పర్స్పెక్టివ్ ఫర్ ది 21వ సెంచరీ' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

విశాఖ రైల్వేస్టేషన్‌లో అమృత్ సంవాద్



ఉత్తమ సూచన అందజేసిన ప్రయాణికురాలికి కానుక అందిస్తున్న రైల్వే అధికారి పవన్‌కుమార్

తాటిచెట్లపాలెం: ప్రత్యేక క్యాంపెయిన్-5లో భాగంగా ప్రయాణికుల భాగస్వామ్యంతో కూడిన అమృత్ సంవాద్ కార్యక్రమాన్ని విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం నిర్వహించారు. జనరల్ స్లీపర్ క్లాస్ వెయిటింగ్ హాళ్ల వద్ద వాల్తేర్ డివిజన్ కమర్షియల్ మేనేజర్ కె. పవన్‌కుమార్ ప్రయాణికులతో ముచ్చటించారు. వారి సలహాలు, సూచనలు స్వీకరించారు. రైల్వే అధికారులు, ప్రయాణికుల ప్రత్యక్ష సమాచార ప్రక్రియలో భాగమే అమృత్ సంవాద్. అక్టోబరు 31వ తేదీ వరకు జరిగే ఈ ప్రత్యేక క్యాంపెయిన్‌లో భాగంగా రైల్వే అధికారులు స్వయంగా ప్రయాణికుల నుండి పలు సూచనలు స్వీకరిస్తున్నారు. విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం జరిగిన అమృత్ సంవాద్ కార్యక్రమంలో భాగంగా ప్రయాణికులు కొన్ని సూచనలు చేశారు. ఎస్కలేటర్స్ దగ్గర కచ్చితంగా సహాయకులను నియమించాలని, వారు లేకపోవడంతో సీనియర్ సిటిజన్లు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అలాగే స్లీపర్‌క్లాస్ కోచ్‌లలో రైల్వేనే భోజనం ఏర్పాటు చేయడం మంచిదని పలువురు తెలిపారు. వీరికి సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. పవన్‌కుమార్ చిరు కానుకలు అందజేశారు.

ముందస్తు పరీక్షలతో రొమ్ము క్యాన్సర్ నియంత్రణ



రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల కూపన్ ఆవిష్కరిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యాదేవి

ఆరిలోవ : రొమ్ము క్యాన్సర్‌కు ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవడం అవసరమని ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి సూచించారు. బ్రెస్ట్ క్యాన్సర్ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం హెల్త్ సిటీ మెడికవర్ ఆస్పత్రిలో రొమ్ము క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెడికవర్ యాజమాన్యం అందుబాటులోకి తీసుకొచ్చిన ఉచిత స్క్రీనింగ్ పరీక్షల కూపన్‌ను వైద్యులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. నెల రోజులపాటు మహిళలకు ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు క్యాన్సర్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి ఎదుర్కోవాలన్నారు. లేదంటే ప్రాణాలకు ప్రమాదమని ఆమె హెచ్చరించారు. చీఫ్ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ రమావత్ దేవ్ మాట్లాడుతూ క్యాన్సర్ నియంత్రణకు అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో అంకాలజిస్టులు డాక్టర్ సాహిత్య, డాక్టర్ కార్తీక్ చంద్ర, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ రమేష్, డాక్టర్ అభిలాష్, సెంటర్ హెడ్ డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు.